క్లుప్తంగా

చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సమగ్రశిక్ష ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

జగ్గంపేట: విద్యార్థి సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గురువారం చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.సతీష్ కోరారు. జగ్గంపేట యూటీఎఫ్ భవన్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయిలో పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ పరీక్షలను బాధ్యతారాహిత్యంతో నిర్వహించారని విమర్శించారు. బీజేపీ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించారన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అరుణ్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మయూరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



బొద్దవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేయాలని పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బొద్దవరం, జగన్నాథపురం, కాకరాపల్లి, అల్లిపూడి, కోటనందూరు గ్రామాల్లో బుధవారం రాజీవ్‌గాంధీ పంచాయత్ శక్తికరణ్ అభియాన్(ఆర్జీపీఎస్ఏ) గ్రామ సభలు నిర్వహించారు. బొద్దవరంలో జరిగిన గ్రామ సభలో అరుణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. పల్లెల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచాయతీల్లో గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేయాల్సిన పనులు, పంచాయతీల అదాయం, 15వ ఆర్థిక సంఘం నిధులు తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హత్రాస్ ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలి



రంగవల్లినగర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో తొక్కిసలాట జరిగి వంద మందికి పైగా చనిపోవడానికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. హత్రాస్ ఘటనకు నిరసనగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి రూ. 20 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు దేశెట్టి సురేష్, సోమరాజు, దేవి, అర్జున, కరుణ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులను వినియోగించవద్దు

గండేపల్లి: ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని ప్రతిఒక్కరూ విడనాడాలని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌ల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఖరీఫ్ పనులకు శ్రీకారం

- మెట్టలో వరి నారుమళ్లు వేస్తున్న రైతులు
- తుని సబ్ డివిజన్‌లో 16,206 హెక్టార్లలో సాగు
- జలాశయాల్లో స్వల్పంగా పెరిగిన నీటి నిల్వలు



ఎస్‌బీ పేటలో బోరుబావి కింద వేసిన వరినారు మడి

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగు పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో వర్షాధారం, బోరుబావుల ఆధారంగా దుక్కులు చేసిన రైతులు నాలుగైదు రోజులుగా వరినారుకు విత్తనాలు వేస్తున్నారు. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్‌లో 16,206 హెక్టార్లలో ఖరీఫ్ సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేశారు. ఇందుకు అవసరమైన విత్తనాలు 7565 క్వింటాళ్లు, ఎరువులు 10,045 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్ సొసైటీల్లోను, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. సాగు నీటి లభ్యత లేని మెరక భూముల్లో సాంప్రదాయ పంటల స్థానే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణం, గిట్టుబాటు ధర బాగుండడంతో కొంతమంది రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలను విత్తారు. ప్రత్యామ్నాయ పంటలుగా చిరుధాన్యాలు సాగు చేయాలని అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీ వర్షాలు కురిస్తేనే...

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు పూర్తయ్యింది. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్‌లో ఐదు మండలాలకు పంపా, తాండవ, ఏలేరు జలాశయాలు, పుష్కర కాలువ, సాగునీటి చెరువులు ద్వారా సాగునీరు అందుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా సాగునీటి వనరుల్లో స్వల్పంగా నీటి నిల్వలు పెరిగాయి. 105 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల పంపా రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉంది. 380 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల తాండవ రిజర్వాయర్‌లో మూడు అడుగులు నీటి నిల్వలు పెరిగి 361.22 అడుగులకు చేరింది. 283.99 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఏలేరు జలాశయంలో నాలుగు అడుగుల మేరకు నీటి నిల్వలు పెరిగి 231.33 అగుగులకు చేరింది. పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు తాండవ నదిలో నీరు చేరుతుంది. దీంతో తుని వద్ద ఉన్న రెండు మినీరిజర్వాయర్లలో నీటి నిల్వలు చేరాయి.

వర్షం పాతం వివరాలు



పంపా రిజర్వాయర్‌లో అడుగంటిన నీటి నిల్వలు

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలైన నెలరోజుల్లో సబ్‌డివిజన్ పరిధిలో సాధారణం కంటే అధికంగానే వర్షాలు కురిశాయి. తుని మండలంలో సాధారణ వర్షపాతం 141.1 మిల్లీ మీటర్లు కాగా 273.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తొండంగి మండలంలో 130 మిల్లీ మీటర్లకు 279, కోటనందూరు మండలంలో 90 మిల్లీ మీటర్లకు 442.9, రౌతులపూడి మండలంలో 131.7 మిల్లీ మీటర్లకు 207.3, శంఖవరం మండలంలో 131.7 మిల్లీ మీటర్లకు 249.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మెట్ట ప్రాంతంలో ఆలస్యంగా నాట్లు వేయడం పరిపాటి కావడంతో మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

తుని సబ్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం, ఎరువులు, విత్తనాల లభ్యత

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	విత్తనాలు (క్వింటాళ్లలో)	ఎరువులు (టన్నుల్లో)
తుని	3335	1460	2705
కోటనందూరు	4100	1035	1156
తొండంగి	5246	3248	4420
శంఖవరం	1502	412	779
రౌతులపూడి	2023	1410	985
మొత్తం	16,206	7,565	10,045

ఐదెకరాల్లో సాగు



సొంతభూమి రెండెకరాలు, కౌలు భూమి మూడు ఎకరాలు సాగు చేస్తున్నాను. విద్యుత్ బోరుబావి ఆధారంగా వరినారు వేశాను. వర్షాలు, తాండవ జలాశయం నుంచి సాగునీరు కాలువకు వస్తే నాట్లు వేస్తాను. పంట చేతికి అందేవరకు సాగునీరు సరఫరా చేయాలి. వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి.

– కొండయ్యనాయుడు, రైతు, ఎస్‌బీ పేట

ప్రత్యామ్నాయ పంటలు మేలు



మెట్ట ప్రాంత రైతులు వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేయాల్సి వస్తుంది. సాంప్రదాయ పంటలస్థానే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం మేలు. ఇప్పటికే పలువురు రైతులు పత్తి సాగు చేపట్టారు. చిరుధాన్యాల సాగుతో మంచి లాభాలు పొందవచ్చు. విత్తనాలు సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఏలేశ్వరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న జేడీ విజయ్‌కుమార్

ఏలేశ్వరం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఇలియాజ్‌తో కలిసి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలేని సమయంలో, తొలకరికి ముందు పంటలు వేసే విధానం (పీఎండీఎస్) ద్వారా పంటలకు రసాయనిక ఎరువులు తక్కువ వాడవచ్చన్నారు. ఏలేశ్వరం యూనిట్ పరిధిలో పీఎండీఎస్ విధానం ద్వారా వంద ఎకరాల సాగు చేపట్టినట్టు తెలిపారు. ఈ విధానంలో 10 రకాల విత్తనాలు 10 కేజీల మోతాదులో వినియోగించవచ్చన్నారు. ఈ విధానం ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, సుగంధద్రవ్యాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు తదితర పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బి.జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

గండేపల్లి: బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లేపల్లి హైస్కూల్‌లో బుధవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే హెల్ప్ లైన్ నంబర్ 1098, 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ, ఎంఈఓ నాయక్, సూపర్ వైజర్ నాగపార్వతి, హెచ్ఎం సుధామాధురి తదితరులు పాల్గొన్నారు.

మహిళను అరెస్టు చేసిన ముంబై పోలీసులు

ప్రత్తిపాడు: మానవ అక్రమ రవాణా కేసులో ప్రత్తిపాడుకు చెందిన మహిళను కంజుర్‌మర్గ్ (ముంబై) పోలీసులు అరెస్టు చేశారు. ఈకేసులో నిందితురాలు టి.మంగతాయారు కోసం ముంబై పోలీసులు గ్రామంలో ముమ్మరంగా గాలిస్తున్న విషయం తెలిసిందే. దీంతో సదరు నిందితురాలు పరారైంది. బాలుడి అక్రమ రవాణా సంఘటనలో వినియోగించిన ఫోన్ ఆధారంగా గ్రామానికి చెందిన నిందితురాలి బంధువు కె.అమ్ములును కంజుర్‌మార్గ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కోర్టులో హాజరు పరచి, ట్రాన్సిస్ట్ వారంట్‌పై ముంబై తరలించారు.

'ఎక్స్ అఫిషియో'గా ప్రమాణ స్వీకారం



ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే దివ్యను సత్కరిస్తున్న కౌన్సిలర్లు

తుని: పురపాలక సంఘం కౌన్సిల్‌లో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. తుని ఎమ్మెల్యేగా తనను ప్రజలు ఎన్నుకున్నందున కౌన్సిల్‌లో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని నోటీసు ద్వారా తెలియ పరచడంతో కమిషనర్ వెంకట్రావు దివ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మహిళా కౌన్సిలర్లు దివ్యను సత్కరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని సీపీ సుధారాణి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి అందరం కలిసి పని చేద్దామన్నారు. తుని మున్సిపాలిటీని మోడల్ సిటీగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత అందరు కలిసి ముందుకు వెళ్లాలన్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దివ్యకు నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.

చర్చ లేకుండానే అంశాలు ఆమోదం

అజెండాలో పొందుపరిచిన 25 అంశాలను కౌన్సిల్ సభ్యులు చర్చ లేకుండానే ఆమోదించారు. అత్యవసర కార్యక్రమాల దృష్ట్యా అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్టు చైర్‌పర్సన్ సుధారాణి చేసిన ప్రకటనను అందరూ బలపర్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, 30 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వసుంధర
- పలు గ్రామాల్లో పర్యటన



కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో రోగి వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

గోకవరం: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ వసుంధర సూచించారు. మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. తొలుత కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్షయవ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వీరలంకపల్లిలో బాలికల గురుకుల పాఠశాల, గోకవరంలో ఎస్టీ బాలిక వసతి గృహాన్ని, తంటికొండలో వెల్‌నెస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే తంటికొండలో రక్షిత తాగునీటి క్లోరినేషన్ ప్రక్రియను, నీటి శాంపిల్స్‌ను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్ఆర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. డయేరియా, జ్వరం కేసులను క్షేత్రస్థాయి సిబ్బంది సకాలంలో గుర్తించి సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే లెప్రసీ కేసుల తనిఖీ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. అనుమానిత చర్మవ్యాధులు, హెచ్ఐవీ, టీబీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ జ్ఞానచంద్ర, డాక్టర్ సునీల్, ఎంపీహెచ్ఈఓ డీఏ మూర్తి, సిబ్బంది జగదీష్, రమ్యదేవి, రవి, అనూష, పవన్, రమణ, నాగేశ్వరరావు, నాగలక్ష్మి, సూర్యకాంతం, ఎస్‌టీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

ప్రత్తిపాడు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఇచ్చే చిరుధాన్యాల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ్ కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు చిరుధాన్యాల సాగుపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా రాగి విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. చిరుధాన్యాలను సాగు చేసే విధానాలను రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు ఇంటి వీర గంగాధర్‌కుమార్, ఏలేశ్వరం మండల వ్యవసాయాధికారి జ్యోతి, టెక్నికల్ వ్యవసాయాధికారి పద్మజ, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

శంఖవరం: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏడీఏ ఎస్.బుల్లిబాబు ఆధ్వర్యంలో ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందికి చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. చిరు ధాన్యాల విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తోందన్నారు. చిరుధాన్యాల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ భ్రమరాంబ, వ్యవసాయాధికారులు ఈశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో తనకు గల 30 సెంట్ల భూమిలో సాగు చేసిన చిక్కుడు పంటను గ్రామానికి చెందిన మంచిన చిట్టిరాజు ధ్వంసం చేసినట్టు అదే గ్రామానికి చెందిన పల్లి సత్యవతి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పొలంలో సాగు చేసిన చిక్కుడు పాదులను చిట్టిరాజు ట్రాక్టర్‌తో దున్నేసి, పాదుల కోసం కర్రలతో ఏర్పాటు చేసిన కంపను తొలగించాడన్నారు. చేతికి వచ్చే పంటను ధ్వంసం చేయడం వల్ల తనకు రూ.70 వేల నష్టం వాటిల్లిందన్నారు. గతేడాది ఇదే తరహాలో తన పంటకు నష్టం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా అనారోగ్య సమస్యను సాకుగా చూపించి ఇప్పటివరకూ కాలయాపన చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో పంటను నాశనం చేసి తన పొలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తాను దళితురాలిని కావడంతో పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్త చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- వేలాదిగా తిలకించిన భక్తులు
- ఘనంగా స్వామివారి గరుడవాహన సేవ



గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు



ఉత్తరకంచిలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో వేంచేసిన పద్మావతి అలువేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు అర్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ వేదికపై పద్మావతి అలువేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మండలంలోని ఉత్తరకంచి, పెద్దిపాలెం, లంపకలోవ పరిసర గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. దారి పొడువునా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



గోకవరంలో ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన సమితి సభ్యులు, బీజేపీ శ్రేణులు

గోకవరం: కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం గోకవరంలో ధర్నా చేశారు. స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద నుంచి హిందువులు, బీజేపీ నాయకులు ప్రధాన రహదారిపై ర్యాలీ చేశారు. రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిలో భాగంగా స్థానిక ఆంజనేయస్వామిగుడి సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు నిలయంగా ఉన్న భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అన్నదమ్ములు వలే కలిసికట్టుగా ఉంటున్నారన్నారు. ఈ నెల 1న కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సమావేశాల్లో ప్రసంగిస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. తక్షణమే రాహుల్‌గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాథశర్మ, హిందూ ధార్మిక సంఘాల సభ్యులు ఉంగరాల ఆదివిష్ణు, మంగరౌతు దుర్గా శ్రీనివాస్, ఆచంట రాజు, అప్పలస్వామి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, సబ్బెల్ల రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.